అసంపూర్తిగా భవనాలు

- బిల్లులు అందక నిలిచిన పంచాయతీ కార్యాలయ పనులు
- నిధులకోసం ఎదురు చూపులు
- బిల్లులు ఇవ్వాలని వేడుకుంటుకున్న వైనం


మాధవరంలో స్లాబ్ వరకు నిర్మించిన పంచాయతీ భవనం

మరికల్: గత ప్రభుత్వ హయంలో నూతన గ్రామ పంచాయతీ భవనాలకు శ్రీకారం చుట్టింది. భవన నిర్మాణాల కోసం అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించింది. కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉండగా మరి కొన్నిచోట్ల పనులే ప్రారంభం కాలేదు. కొన్నింటికి చేసిన పనులకు బిల్లులు మంజూరు చేసిన, మొత్తం పనులు పూర్తిచేసిన మరికొన్నింటికి ఇంకా బిల్లులు రాలేదు. ప్రభుత్వం మారడంతో కనీసం చేసిన పనులకైనా బిల్లులు ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ మాజీ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు తిరుగుతున్నారు. లోటు బడ్జెట్ వల్ల ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు విడుదల కాకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. అప్పటినుంచి ప్రభుత్వంపై వారంతా పెండింగ్ బిల్లుల కోసం ఒత్తిడి తెస్తున్నా ఫలితం మాత్రం కన్పించడం లేదు.

మండలంలో ఇలా..

మండలంలో 17 పంచాయతీలుండగా మరికల్, పల్లెగడ్డ, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో భవనాలు పూర్తి చేశారు. బిల్లులు ఇవ్వకుండానే భవనాలు ప్రారంభించారు. మధావరం, బూడ్యాగానితాండ, వెంకటాపూర్, పెద్దచింతకుంట గ్రామాల్లో పైకప్పులకే పరిమితమైంది. వీటికి గాను 2021–2022లో ఉపాధిహామీ పథకంలో పనులు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి భవనానికి రూ. 20లక్షల చొప్పున కేటాయించారు. గత ఏడాది మార్చిలోనే వీటి నిర్మాణాలు పూర్తి చేయాల్సింది. కానీ సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు ఒకేసారి మంజూరు కావడంతో రోడ్లను ముందుగా పూర్తి చేశారు. తర్వాత పంచాయతీ భవనాల నిర్మాణం మందగించింది.

అసంపూర్తి నిర్మాణాలు..

ప్రభుత్వం నుంచి నూతన పంచాయతీ భవనాలకు సక్రమంగా నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టారు. మండలంలో మాధవరం, ఎలిగండ్ల, బూడ్యగానితండాలో స్లాబ్ వరకు వచ్చిన బిల్లుల వరకే పనులు చేపట్టారు.

పెండింగ్ చెల్లించాలి..



కొత్త పంచాయతీ భవనం నిర్మించి ప్రభుత్వానికి అప్పగించాం. మొదట రూ. 7లక్షల బిల్లులు మాత్రమే వచ్చాయి. మిగితా చేసిన పనులకు బిల్లు ఇస్తేనే భవనం ప్రభుత్వానికి అప్పగిస్తామని చెప్పాం. మిగితా రూ. 13లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉంది. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

– గోవర్ధన్, మాజీ సర్పంచ్, మరికల్

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



పంచాయతీ భవనం పూర్తిచేసి బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. వారు అడిగే కమిషన్లు ఇవ్వలేమని చెప్పడంతో బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. రూ. 20లక్షలతో పంచాయతీ భవనం నిర్మించి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించాం. రూ. 13లక్షల బిల్లు రావాల్సి ఉంది.

– అంజనేయులు, మాజీ సర్పంచ్, పల్లెగడ్డ

పూర్తి చేసిన పనులకు బిల్లులు ఇచ్చాం..

స్లాబ్ వరకు నిర్మించిన పంచాయతీ భవనాలకు బిల్లులు అందజేశాం. మిగితా పనులు పూర్తిచేసిన తర్వాత పనులు పరిశీలించి బిల్లులు మంజూరు చేస్తాం. భవనాలు పూర్తిచేసిన వాటికి కూడా బిల్లులు విడుదల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

– హీర్యానాయక్, ఈఈ, నారాయణపేట

వైభవంగా కడపరాయస్వామి రథోత్సవం


ధన్వాడలో కడపరాయస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు


ఊట్కూర్‌లో పల్లకీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో కడపరాయ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు భక్తులు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పల్లకిలో ఉంచి ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులు హరినామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామస్తులే కాకుండా కర్ణాటక, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి తరలివచ్చారు. దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆంజనేయస్వామి ఘనంగా జాతర..

మరికల్: మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఘనంగా ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఊరేగింపుగా సాగుతున్న రథోత్సవాల్లో అడుగుల భజన చేస్తు అలరించారు. అనంతరం నందికోళ్లసేవ, అడుగుల భజన నిర్వహించారు. గ్రామస్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేశారు.


అప్పంపల్లిలో అడుగుల భజన వేస్తున్న గ్రామస్తులు

ఘనంగా పల్లకీసేవ

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. పూల మాలలతో అలంకరించిన పల్లకీలో ఆంజనేయ ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పల్లకిసేవ కార్యక్రమం చేపట్టారు. భక్తులు భజనలు, కొలాటాలతో రామనామస్వరం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నర్సింహాజోసి, వేణుగోపాల్ జోసి, భక్తులు కృష్ణయ్య, మహేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

మరికల్: మండల కేంద్రంలో సోమవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కలశం ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక కుర్వగేరి శివాలయం ఆవరణలో పడిపూజను వైభవంగా నిర్వహించారు. అనంతరం శబరికి పాదయాత్ర ద్వారా వెళ్లి వచ్చిన స్వాములను సన్మానించారు. అనంతరం భక్తులతోపాటు గ్రామస్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములతోపాటు భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని దమ్‌గాన్‌పూర్, మద్దూరులో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. సోమవారం రాత్రి దమ్‌గాన్‌పూర్‌లోని మహేశ్వర్ రెడ్డి నివాసంలో రవీంద్రనాథ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి పడిపూజను నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన మాలధారులు హాజరయ్యారు.


మరికల్‌లో మహాపడిపూజను నిర్వహిస్తున్న గురుస్వాములు

నర్వ: మండలంలోని పాథర్చేడ్‌లో అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి లక్ష్మీనర్సింహా గురుస్వామిచే స్వామివారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అయ్యప్పస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవశాస్త్రంపై మక్కువ పెంచుకోవాలి

మద్దూరు: విద్యార్థులు జీవశాస్త్రంపై మక్కువ పెంచుకోవాలని ఎంఈఓ బాలకిష్టప్ప తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రంపై ప్రతిభ పరీక్షను మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శాస్త్ర సాంకేతిక కొత్తపుంతలు తొక్కుతున్న వేళ విద్యార్థులు దీనిపై ఇష్టం పెంచుకొని కష్టపడి చదవాలని సూచించారు. జీవశాస్త్రంలో ఉండే అవకాశాలను, పరిశోధనలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బాలిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింహారెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు లాజర్, భరత్, శారధ, బీమ్లానాయక్, రాజునాయక్, ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ బాలకిష్టప్ప

డీఎంఆర్ ట్రస్టు ద్వారా విద్యార్థినులకు అల్పాహారం


విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే వారికి డీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అల్పాహారం అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు శ్యాం తెలిపారు. పాఠశాలలో సోమవారం డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన అల్పాహారం విద్యార్థినులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లగా డీఎంఆర్ ట్రస్టు ద్వారా మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం కరుణాకర్, ఉపాధ్యాయులు ఆదాం, విమల, శారద, సింగిల్‌విండో డైరెక్టర్ చిన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలలో ఆంగ్ల మీడియంతో పాటు తెలుగు మీడియం ఆరు నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్నాయి. పాఠశాలలో సుమారు 380 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు ఆడుకునే సమయంలో అటుగా వెళ్లాలంటే భయపడే పరిస్థితులు దాపరించాయి. వీటికి కంచె ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేక పోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పాఠశాల ఆవరణంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



కోయిల్‌కొండ: గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయితీ కార్మికులతో కలిసి మాట్లాడారు. ఈనెల 17న పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మండల కోశాధికారి అజ్జుపాష, చంద్రశేఖర్, నరసింహ, వడెన్న, హనుమంతు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. చలో నేడు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వుంజనూర్ ఆంజనేయులు కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అందక చాలా ఇబ్బందులకు గురువుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం రూ. 18వేలు అమలు చేయాలన్నారు.

రైతుభోరోసా ఐదు ఎకరాలకు పరిమితం చేయాలి

కృష్ణా: ప్రభుత్వం రైతుభరోసాను కేవలం సన్న చిన్నకారు రైతులకు మాత్రమే అందించాలని, మొత్తం రైతులకు కాకుండగా ఐదు ఎకరాలకు పరిమితం చేయడం ఉపయోగకరమని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5 ఎకరాలలోపు రైతులకు రైతుబరోసాను అందిస్తేవారి అభివృద్ధికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ విషయంపై ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలు చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నారులకు నోట్‌పుస్తకాల పంపిణీ



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 40మంది చిన్నారులకు జనతా గ్యారేజ్ వాట్సాప్ గ్రూప్ తరపున పలకలు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నిరుపేద పిల్లలకు తమవంతు సహాయంగా జనతా గ్యారేజ్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు ముందు కొచ్చి ఇలాంటి మంచి కార్యానికి సిద్ధపడటం అభినందనీయమని వారు కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు రెహమాన్, అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నేడు అసెంబ్లీ ముట్టడి

నారాయణపేట ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిచాలని కోరుతూ.. నేడు అసెంబ్లీ ముట్టడికి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నాయని వాటిని పట్టించుకోవడానికి కనీసం విద్యాశాఖకు మంత్రి కుడా లేకపోవడం బాధకరమైన విషయమని, రాష్ట్ర వాప్తంగా విద్యార్థులకు సకాలంలో అందాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, యువకులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు.

యాంకే నాగేశ్వర్‌కు సన్మానం



మాగనూర్: మండలంలోని మందిపల్లికి చెందిన యాంకే నాగేశ్వర్ 2024 డీఎస్సీలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ ఉద్యోగం పొందారు. దీంతో సోమవారం కొల్పూర్‌కు చెందిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులు ఆయనకు శాలువాతో సత్కారించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో వెలసిన శ్రీసయ్యద్‌షా మహబూబ్ ఉస్సేనీ దర్గా ఉర్సు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ దర్గా వద్దకు చేరుకొని కందూర్లను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహబూబ్ ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూల చాదర్లను సమర్పించారు.



కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


పేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించిన కౌన్సిలర్ ఎండీ సలీం


మాగనూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

నారాయణపేట టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ ఎండీ సలీం అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ 7వ వార్డు పరిధిలోని అశోక్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంపిక సర్వేను పర్యవేక్షించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా లబ్ధిదారులు ఎంపికకోసం యాప్‌లో వార్డు ఆఫీసర్ లబ్ధిదారుల వివరాలను నమోదు చేశారు. ఈ మేరకు.. పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు సర్వేకు వచ్చిన అధికారులకు అవసరమైన పత్రాలు అందించి సహకరించాలని కోరారు. డిసెంబర్ నెల చివరి నాటికి సర్వేను పూర్తి చేయించి త్వరగా లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

మాగనూర్: ఇందిరమ్మ పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే కొనసాగుతుది. ఇందులో భాగంగా సోమవారం మాగనూర్ పంచాయతీలో నిర్వహించిన సర్వేను ఎంపీడీఓ రహ్మతుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు, సొంత ఇంటి స్థలం , దానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మక్తల్, ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రానున్నాయని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్తూ ఇబ్బందులకు గురవుతున్నారని.. మక్తల్, ఆత్మకూర్‌లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆత్మకూర్, మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని.. కిడ్నీ సంబంధిత రోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

రెగ్యులర్ చేసేవరకు నిరవధిక సమ్మె


చెవిలో పువ్వుపెట్టుకుని ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నారాయణపేట రూరల్: ఉద్యోగ భద్రతను కల్పిస్తూ సర్వీస్‌ను రెగ్యులర్ చేసే వరకు నిరవధికంగా సమ్మె చేస్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు స్పష్టం చేశారు. సోమవారం విధులు బహిష్కరించి స్థానిక శ్రీ వివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన చేశారు. వారు మాట్లాడుతూ.. 14 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయలేదని వాపోయారు. రెగ్యులర్ చేసే వరకు మినిమం టైం స్కేల్ అందించాలని డిమాండ్ చేశారు. గతంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చి, ఏడాది గడుస్తున్నా పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎల్లాగౌడ్, అల్తాఫ్ హుస్సెన్, అరిఫ్ అహ్మద్, నారాయణ పవర్, రాజేష్, రాజశేఖర్ గౌడ్, తపస్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య పాడుబడిన బావి

అమరచింత: పట్టణంలోని శివాజీనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న నాగులబావి పాడుబావిగా మారినా అధికారులు దానిని పూడ్చే ప్రయత్నం చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. షాదీఖానా సమీపంలో పాడుబావి ఉండటం, పంట పొలాలకు అక్కడి నుంచే కాలిబాట ఉండటంతో రైతులతో పాటు కాలనీ ప్రజలు వెళ్తుంటారు. పాడుబావిలో ఒకటో వార్డులోని ఆయా కాలనీలకు చెందిన మురుగు అంతా బావిలోకి చేరుతుండటంతో చుట్టుపక్కల దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్తున్న రైతులు కంచె లేని పాడుబావిలో జారిపడే ప్రమాదం ఉందని బావిని పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.


శివాజీనగర్‌లో పాడుబావి

బస్సు యాత్రను జయప్రదం చేయండి



ఊట్కూరు: తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి తబేరాబేగం కోరారు. సోమవారం నిడుగుర్తిలో బస్సుయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15నుంచి 31వరకు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టినట్లు తెలిపారు. బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 22న నారాయణపేటకు చేరుకుంటుందని రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మీ, కార్యదర్శి నీలాదేవి తదితరులు బస్సుయాత్రలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శంకర్, అంజప్ప, లక్ష్మీ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ



ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో సోమవారం జరిగిన కడపరాయస్వామి జాతర ఉత్సవాల్లో మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారి నాగరాజు ఆయనకు స్వాగతం పలికి స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీ మండల అధ్యక్ష ఎన్నిక

నర్వ: ఈ నెల 18న బీజేపీ మండల అధ్యక్ష ఎన్నిక కోసం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఫాంహౌస్ వద్ద ఈ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష ఎన్నిక పోటీలో పేర్లను ప్రతిపాదించి 19న జిల్లా కేంద్రంలో జరగబోయే సమావేశంలో ఈ పేర్లను అందిస్తారన్నారు. ఈ సమావేశానికి బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

రేపు ధ్యానమందిర వార్షికోత్సవం

కోయిల్‌కొండ: చంద్రాస్‌పల్లి గ్రామంలో నెలకొల్పిన శ్రీరామచంద్ర పిరమిడ్ ధ్యాన మందిర 8వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రంగారెడ్డి సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ధ్యానమందిర వార్షికోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.